క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నందిగామటౌన్: వైద్యఖర్చుల భారం నిరుపేదలపై పడకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 46మందికి మంజూరైన రూ.58.29 లక్షలను శనివారం ఆమె లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విజయవాడ రూరల్ డీసీపీ మల్లికార్జునరాజు సూచించారు. గ్రామంలోని ఎంసీఎల్ క్వార్టర్స్‌లో సైబర్ నేరాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని మోసపూరిత యాప్‌లు వస్తున్నాయన్నారు. వాటికి ఓటీపీలు, బ్యాంకు వివరాలు చెప్పాలని కోరుతూ వచ్చే ఫోన్లకు స్పందించవద్దన్నారు. గ్రామాల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు ఎల్‌హెచ్ఎం యాప్‌లో నమోదు చేసుకుంటే పోలీసులు ఇంటి వద్దకు వచ్చి సీసీ కెమెరా ఏర్పాటు చేస్తారని తెలిపారు. అనంతరం గ్రామంలో సైబర్ నేరాలపై మైకు ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నందిగామ ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సూర్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై సిబ్బందికి అవగాహన



పెనుగంచిప్రోలు: రైతులు రైతుసేవా కేంద్రాల ద్వారా వరిధాన్యాన్ని అమ్ముకోవాలని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శిక్షణనిచ్చారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి విధివిధానాలను వివరించారు. పౌరసరఫరాల శాఖ కార్యాలయ అసిస్టెంట్ మేనేజర్(టెక్నికల్) ఎం.జయప్రద, ఎంపీడీఓ జి.శ్రీను, ఏఓ కె.రామ సుబ్బారెడ్డి, డీటీ కె.భాస్కర్, వీఆర్ఓ, వ్యవసాయ శాఖ గ్రామసహాయకులు, పీఏసీఎస్ సీఈవోలు, పాల్గొన్నారు.

బహుమతులు అందజేత



జగ్గయ్యపేటఅర్బన్: శ్రీసత్యసాయిబాబా 99వ జయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీసత్యసాయిబాబా సేవాసమితి వారు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ఈపోటీల్లో నాగార్జున హైస్కూల్ విద్యార్థులు వైష్ణవి, ఎస్.రామచరణ్ వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులను గెలుచుకున్నారు. విజేతలను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు



నందిగామటౌన్:భగవాన్ సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక సత్యసాయి మందిరంలో నిర్వహిస్తున్న జయంతి వేడుకల్లో శనివారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఓంకారం, సుప్రభాతం, స్వామి వారి పాదుకలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, 99 జ్యోతులు వెలిగించుట, మంగళహారతి, నగర సంకీర్తన, వేద పఠనం, భజన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం స్వామివారి చిత్ర పటాన్ని విద్యుత్ దీపకాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి మేళతాళాలతో నిర్వహించిన రథోత్సవం కన్నుల పండువగా సాగింది. మాజీ ఎంపీపీ కోవెలమూడి వెంకట రమణ దంపతులు పాల్గొని పూజలు చేశారు. స్వామివారి జయంతి ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సేవా సమితి ప్రతినిధులు వాసుదేవరావు, సరికొండ రవీంద్ర, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాలభైరవుడికి గారెలతో హోమం

ముండ్లపాడుక్రాస్‌రోడ్స్(పెనుగంచిప్రోలు): పవిత్ర కార్తికమాసం, బహుళ అష్టమి సందర్భంగా శనివారం స్థానిక జాతీయ రహదారిపై ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వద్ద కాలభైరవుడి ఆలయంలో 1200 గారెలతో ప్రత్యేకంగా హోమం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా దీపాల అలంకరణ, ప్రసాదాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇసుకాయ స్వాహా

అనుమంచిపల్లి స్టాక్ పాయింట్ వద్ద అధిక లోడింగ్

లారీకి ఐదు నుంచి పది టన్నుల ఇసుక అదనం

వేబ్రిడ్జి లేకపోవడంతో దర్జాగా ఇసుక దోపిడీ

జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు

ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి



అనుమంచిపల్లి స్టాక్‌పాయింట్ వద్ద లారీలో ఇసుక నింపుతున్న ప్రొక్లెయిన్



ఇసుక కోసం అనుమంచిపల్లి స్టాక్ పాయింట్ వద్దకు వచ్చిన లారీలు



లారీకి బాడి లెవల్ వరకు పోసిన ఇసుక

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): ఇసుక..కూలీలకు పనికల్పిస్తే..అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది..కంచే చేను మేసినట్లుగా ఇసుక స్టాక్‌పాయింట్ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటఅక్రమార్కుల పాలిట వరంగా మారింది. ఇందుకు అనుమంచిపల్లి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద యథేచ్ఛగా సాగుతున్న ఇసుక ఓవర్ లోడింగే నిదర్శనం. ఇసుక దోపిడీదారులు, స్టాక్‌పాయింట్ సిబ్బంది కలిసి కుమ్మక్కై ఒక్కో లారీకి అదనంగా ఐదు నుంచి పది టన్నుల మేర ఇసుకను అధికంగా లోడ్ చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండికొడుతున్నారు.

వేబ్రిడ్జి లేకపోవడమే కారణం..

అనుమంచిపల్లి ఇసుక స్టాక్ పాయింట్ ద్వారా ప్రభుత్వం జూలై 8వతేదీ నుంచి ఇసుక అమ్మకాలు చేపట్టింది. ఇక్కడ ఉన్న 81వేల మెట్రిక్ టన్నులు ఇసుక విక్రయించేలా చర్యలు చేపట్టింది. ఇసుక అమ్మకాల్లో అక్రమాలపై విమర్శలు వెల్లువెత్తడంలో పలుమార్లు రెవెన్యూ, మైనింగ్ అధికారులు తనిఖీ సైతం చేశారు. అయినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేదు. ఆన్‌లైన్ ద్వారా ఏ స్టాక్ పాయింట్ నుంచి అయినా ఇసుకను తెచ్చుకునే వెసులుబాటు ఉండటంతో అక్రమార్కులు అనుమంచిపల్లి పాయింట్‌ను అడ్డాగా చేసుకున్నారు. ఇక్కడ వేబ్రిడ్జి లేకపోవడంతో ఇసుక ఎంతమేర లోడ్ చేస్తున్నదీ లేనిది స్పష్టంగా తెలియని పరిస్థితి. ఇక్కడ ఇసుక లోడ్ చేసే సిబ్బంది ఒక్కో లారీకి అదనంగా 5 నుంచి 10 టన్నుల ఇసుకను లోడింగ్ చేస్తుండటమే ఈ డిమాండ్‌కు ప్రధాన కారణం. ఇదే పాయింట్‌ను ఆసరాగా చేసుకుని అక్రమార్కులు అనుమంచిపల్లి పాయింట్ నుంచి ఇసుకను కొనుగోలు చేసి తరలిస్తున్నారు.

రోజుకు 70కిపైగా లారీలకు లోడింగ్..

ఈ స్టాక్ పాయింట్‌కు జగ్గయ్యపేట, నందిగామ సమీప ప్రాంతాల నుంచేగాక గుంటూరు, పల్నాడు, బాపట్ల, పొన్నూరు, ఏలూరు ప్రాంతాల నుంచి కూడా లారీలు వస్తున్నాయి. ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్‌చేసుకుని 10, 12 టైర్ల లారీల్లో ఇసుకను తీసుకువెళ్తున్నారు. మైనింగ్ నిబంధనల ప్రకారం 10 టైర్ల లారీలో 20టన్నులు 12టైర్ల లారీలో 25 టన్నులమేర ఇసుక లోడింగ్ చేయాల్సిఉంది. అయితే ఇక్కడ వేబ్రిడ్జి లేకపోవడంతో స్టాక్ పాయింట్ సిబ్బంది ఈ భారీ వాహనాలకు 10 నుంచి 15 టన్నుల మేర ఇసుకను అదనంగా లోడ్‌చేస్తున్నారు. ఇందుకు వాహనదారుల నుంచి వీరికి భారీగా ముడుపులు అందుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు రోజుకు లక్షలాది రూపాయల మేర గండిపడుతుండగా, ఆసొమ్మంతా అక్రమార్కుల జేబుల్లోకి చేరుతోంది.

కనిపించని సీసీ కెమెరాలు..


స్టాక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిబంధనలు స్పష్టం చేస్తూ ఇక్కడ ఆ నిబంధనలేవి అమలుకావడం లేదు. దీంతో స్టాక్‌పాయింట్ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను కాలరాస్తూ అక్రమార్కులకు కొమ్ముకాస్తూ ఇసుక దోపిడీకి సహకరిస్తున్నారు. ఇకనైనా మైనింగ్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి అనుమంచిపల్లి ఇసుక స్టాక్‌పాయింట్‌లో వేబ్రిడ్జి లేదనే నెపంతో యథేచ్ఛగా సాగుతున్న ఇసుక అధిక లోడింగ్‌కు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

తనిఖీ చేపడతాం...

అనుమంచిపల్లి స్టాక్‌పాయింట్లో నాలుగు నెలలుగా ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. లారీలకు అదనంగా ఇసుకను లోడింగ్ చేయడం నిబంధనలకు విరుద్ధం. స్టాక్‌పాయింట్‌ను పరిశీలించి, ఇసుక అక్రమంగా తరలించినట్లు తేలితే బాధ్యులపై కేసులు నమోదు చేస్తాం.

– ఎ.వీరస్వామి, మైనింగ్ ఏడి, విజయవాడ

డిసెంబర్ 1న వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని కోదాడ రోడ్డు యోగిరామ్ హాస్పిటల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యాలయాన్ని డిసెంబర్ 1వ తేదీ సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఈసందర్భంగా పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఉమ్మడి కృష్ణా జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్లు వైవీ.సుబ్బారెడ్డి, అయోధ్య రామిరెడ్డి, పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని, మాజీమంత్రులు జోగి రమేష్, వెలంపల్లి శ్రీనివాస్, తోపాటు మాజీఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు,కౌన్సిలర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ నాయకులు, మహిళలు, పార్టీ వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

వైభవంగా పడిపూజ



పెనుగంచిప్రోలు: గ్రామంలో శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి వారి పడిపూజ కార్యక్రమాన్ని రామిశెట్టి గోపాలరావు స్వామి ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన మండపంపై శ్రీగణేష్, కుమారస్వామి, అయ్యప్ప స్వాములవారి చిత్రపటాలను ఉంచి గురుస్వామి వాసిరెడ్డి బెనర్జీ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలను కేరళకు చెందిన మురుగన్‌స్వామి నిర్వహించారు. అనంతరం విజయవాడకు చెందిన పసుమర్తి శివరామకుమార్‌స్వామి బృందంచే నిర్వహించిన భజన కార్యక్రమం అందరినీ అలరించింది.

ఎక్సైజ్ స్టేషన్లలో 60 కేసులు నమోదు

- నందిగామలో 33, కంచికచర్లలో 27 కేసులు
- ఊరూరా మద్యం బెల్టుషాపులు
- నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు
- ఎక్కడపడితే అక్కడ తెలంగాణ మద్యం లభ్యం
- సరిహద్దు ప్రాంతాల్లో మరింత అధికం



కంచికచర్ల: నందిగామ నియోజకవర్గంలోని నందిగామ, కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. తెలంగాణ సరిహద్దుగా ఉన్నచోట్ల ఆ రాష్ట్రానికి చెందిన మద్యం ఇక్కడికి అక్రమంగా రవాణా అవుతోంది. నూతన మద్యం పాలసీ అమలులోకి వచ్చాక ఈ 40 రోజుల్లో ఈ రెండు ఎక్సైజ్ పోలీసుస్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల సంఖ్యే ఇందుకు నిదర్శనం. ఎక్సైజ్ పోలీసులు తరచూ తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నప్పటికీ బెల్టుషాపులు మాత్రం యథేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిలో అత్యధికులు అధికార కూటమి నాయకులే కావడంతో వీటిని అరికట్టడంలో ఎక్సైజ్ పోలీసులు విఫలమవుతున్నారని చెప్పవచ్చు. మద్యం అమ్మకాలను పెంచుకునేందుకు దుకాణదారులు ఈ బెల్టుషాపులను ప్రోత్సహిస్తుండగా, ఎక్సైజ్ పోలీసులకు మాత్రం అధికారపార్టీ నాయకుల నుంచి ఒత్తిళ్లు అధికమవుతున్నాయి. దీంతో బెల్టుషాపుల మద్యం విక్రయాలు మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. దీంతో బెల్టుషాపులు ఉండటానికి వీల్లేదని ప్రభుత్వ పెద్దలు చేస్తున్న వ్యాఖ్యలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి.

పట్టుబడుతున్న తెలంగాణ మద్యం..

నందిగామ నియోజకవర్గానికి సంబంధించి నందిగామ, వీరులపాడు మండలాలు తెలంగాణకు సరిహద్దుగా ఉన్నాయి. నందిగామ ఎక్సైజ్‌శాఖ పరిధిలో ఉన్న జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పెనుగంచిప్రోలు మండలానికి కూడా తెలంగాణ సరిహద్దుగా ఉంది. ఈ మండలాల్లో తెలంగాణకు సరిహద్దుగా ఉన్న ప్రాంతాల నుంచి మద్యం అక్రమంగా రవాణా అవుతోంది. పలువురు వ్యక్తులు తెలంగాణ మద్యాన్ని విక్రయిస్తున్నారు. మద్యం నాణ్యత, ధరలు తక్కువగా ఉండటం, అన్నిరకాల బ్రాండ్లు లభిస్తుండటమే తెలంగాణ మద్యం రాష్ట్రంలోకి అక్రమంగా రవాణా అవుతుండటానికి ప్రధాన కారణమనే చెప్పవచ్చు. ఈ తెలంగాణ మద్యం అక్రమరవాణా యథేచ్ఛగా సాగుతుందనడానికి వీరులపాడు మండలం దొడ్డదేవరపాడు గ్రామపరిధిలో శుక్రవారం కంచికచర్ల ఎక్సైజ్ పోలీసులు 11తెలంగాణ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడమే ఇందుకు తాజా ఉదాహరణ. ఇలా తెలంగాణ మద్యం నిత్యం సరిహద్దు దాటి వస్తోంది. కంచికచర్ల ఎక్సైజ్ పోలీసులు నమోదు చేసిన 27 కేసుల్లో 20 కేసులు మద్యం అక్రమరవాణా..బెల్టుషాపుల నిర్వాహకులపై కాగా, తెలంగాణ మద్యం అక్రమరవాణాకు సంబంధించిన వారిపై ఐదు కేసులు నమోదయ్యాయి. రెండు వాహనాలను కూడా సీజ్ చేశారు. నందిగామ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నమోదైన 33కేసుల్లో 10కేసులు తెలంగాణ మద్యం తరలించేవారిపై నమోదైనవే. మిగిలిన 23 కేసులు మద్యం అక్రమరవాణా, బెల్టుషాపుల నడిపే వ్యక్తులపై నమోదయ్యాయి. తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం మనరాష్ట్రంలోకి వస్తుందనే విషయాన్ని ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కూడా ధ్రువీకరించడం గమనార్హం.

లింగగూడెం వాసులకు తాగునీటి కష్టాలు



తాగునీటిని కోసం ఎన్ఎస్‌పీ కాలువ పక్కనున్న బోరు వద్దకు వచ్చిన లింగగూడెం గ్రామస్తుడు

లింగగూడెం(పెనుగంచిప్రోలు): మండలంలోని లింగగూడెంలో తాగునీటి వసతిలేక గ్రామస్తులు ఇబ్బందిపడుతున్నారు. గ్రామానికి తాగునీరు అందించే పథకానికి సంబంధించి పెనుగంచిప్రోలు మునేరులో ఏర్పాటు చేసిన బోరు నుంచి పైపులైన్ ద్వారా గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీటిని ఎక్కిస్తారు. అక్కడి నుంచి గ్రామంలో తాగునీటి సరఫరా అవుతోంది. అయితే సెప్టెంబర్ నెల మొదటి వారంలో వచ్చిన మునేరు వరదలకు పైపులైన్ మొత్తం కొట్టుకుపోయింది. అప్పటి నుంచి మూడునెలలు కావస్తున్నా నేటి వరకు తాగునీటి సరఫరా పునరుద్ధరణ పనులు పూర్తి కాలేదు. దీంతో గ్రామస్తులు తాగునీటి కోసం అవస్థలుపడుతున్నారు.

మూడు కిలోమీటర్లు వెళ్తేనే తాగునీరు..

మునేరు నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో నీటికోసం గ్రామస్తులు నిత్యం కిలోమీటర్ల మేర వెళ్లాల్సి వస్తోంది. గ్రామస్తులు గౌరవరం వెళ్లే దారిలో సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎన్ఎస్‌పీ కాలువ పక్కనున్న బోరు వద్దకు లేదా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న మండలకేంద్రం పెనుగంచిప్రోలుకు వెళ్లక తప్పడం లేదు. వాహనాలు ఉన్నవారు ఎలాగోలా తాగునీటిని తెచ్చుకుంటుండగా, వాహనాలు లేనివారు..వృద్ధుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. దీంతో పెనుగంచిప్రోలు నుంచి మినరల్ వాటర్‌ను కొనుగోలు చేయాల్సివస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఈ విషయంపై మండల పరిషత్ అధికారులను వివరణ కోరగా తాగునీటి పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

వాహనాల తనిఖీ

వీరులపాడు: మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అనిల్ హెచ్చరించారు. మండలంలోని అల్లూరు గ్రామంలో శనివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. ఆటోడ్రైవర్లు వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణం సాగించవద్దన్నారు. వాహనానికి సంబంధించిన అన్నిరకాల ధ్రువీకరణపత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని పలువురు వాహనదారులకు జరిమానా విధించారు.

మావేట్ టెక్నాలజీతో 'అమ్రితసాయి' ఒప్పందం



కంచికచర్ల: విద్యార్థులకు మరిన్ని ఉద్యోగావకాశాలను కల్పించే ఉద్దేశంతో చైన్నైకి చెందిన మోవేట్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ మల్టీనేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీతో ఇండస్ట్రీ అకడమిక్ ఎంగేజ్మెంట్ ఒప్పందం చేసుకున్నట్లు అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు తెలిపారు. కళాశాలలో శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగుపడతాయన్నారు. ఇప్పటికే 306మంది ఉద్యోగాలు సాధించారని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శశిధర్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ పి.చిరంజీవి, వివిధ విభాగాలాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్ ప్రారంభం



సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామాలకు నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని వేదాద్రి గ్రామంలో ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఉన్న త్రీఫేజ్ విద్యుత్ లైన్లతో గాలివర్షాల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగేదన్నారు. దీంతో ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద సింగల్ ఫేజ్ విధానంతో గ్రామాల్లో నాణ్యమైన నిరంతరం విద్యుత్ అందిస్తున్నట్లు వివరించారు. విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 75 కి.మీల మేర 11కెవీ లైన్‌ను విభజించినట్లు తెలిపారు. వేదాద్రి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టామని తెలిపారు. షేర్‌మహ్మద్‌పేట, అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు, పోలంపల్లి గ్రామాల్లో కూడా విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ రమేష్ బాబు, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రంలో మొక్కల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

కంచికచర్ల: నందిగామ నియోజకవర్గంలో నిరుపయోగంగా మారిన చెత్త సంపద తయారీ కేంద్రాలపై 'సంపద కాదు.. చెత్తే మిగిలింది' శీర్షికన ఈనెల 22వతేదీన 'సాక్షి' దిన పత్రిక ప్రచురించిన కథనానికి గండేపల్లి పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రం ఆవరణను శుభ్రం చేయడంతోపాటు తొట్లలో పెరిగిన మొక్కలను తొలగించారు. త్వరలోనే చెత్త సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తెస్తామని వారు పేర్కొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



వనసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న నందిగామ బార్ అసోసియేషన్ న్యాయవాదులు



వనసమారాధనలో డ్యాన్స్‌లు వేస్తున్న చిన్నారులు

కంచికచర్ల : కార్తికమాసం సందర్భంగా నందిగామ న్యాయవాదులు మున్నేరు సమీపంలోని మామిడితోటలో శనివారం వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబూ విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా న్యాయవాదులు పాల్గొని ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వనభోజనాలు చేశారు. సినీగీతాలకు పలువురు న్యాయవాదులు, చిన్నారులు డ్యాన్స్‌లు చేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి అద్దంకి మణిబాబు, వైస్ ప్రెసిడెంట్ కృష్ణం రాజు, సీనియర్ న్యాయవాదులు, పోపూరు సంగీతరావు, యర్రంరెడ్డి బాబురావు, అవల సాంబశివరావు, మన్నెం నారాయణరావు, బొందలపాటి రామకృష్ణ, గుర్రాల వెంకటరత్నం, చెరుకుమల్లి రామారావు, పింగళి వెంకట నరసింహారావు, మట్టా ప్రసాద్, దర్శి అర్జున్ పాల్గొన్నారు.

చెరువుకొమ్ముపాలెం రోడ్డుకు మరమ్మతులు



రహదారి మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న గ్రామనాయకులు

నందిగామటౌన్: మండలంలోని చెరువుకొమ్ముపాలెం నుంచి జగ్గయ్యపేట మండలం బండిపాలెం వెళ్లే రహదారి మరమ్మతు పనులను శనివారం ప్రారంభించారు. రహదారికి ఇరువైపులా కంపచెట్ల తొలగింపుతో పాటు రహదారి మరమ్మతు పనులను చేపట్టారు. మండలంలోని పెద్దవరం గ్రామశివారు క్రిక్స్ బయోటెక్స్ కంపెనీ సహకారంతో రహదారి మరమ్మతు పనులను నిర్వహిస్తున్నట్లు గ్రామనాయకులు ఇంటూరి సీతయ్య, జమ్ములమడుగు హనుమంతరావు, కడియాల చంద్రశేఖర్ తెలిపారు. వారు మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా రహదారి మరమ్మతులకు గురై రాకపోకలు సాగించేందుకు ప్రజలు నానాఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో విషయాన్ని కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి సహకారం అందించడంతో మరమ్మతు పనులను చేపడుతున్నట్లు వివరించారు.